క్లుప్తంగా

పైడమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పెడన: శ్రావణమాసం పురస్కరించుకుని పెడన కాపులవీధికి చెందిన మహిళలు ఆదివారం పైడమ్మకు చలివిడి, వడపప్పు, పానకం అందజేశారు. ఉదయం మేళతాళాలతో ఊరేగింపుగా బయల్దేరి పసుపు జల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ముత్యాలమ్మ ఘటం, పోతురాజు స్వామి ఆలయాలను సందర్శించిన పిమ్మట పైడమ్మ ఆలయానికి చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చలివిడి, వడపప్పు, పానకం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వంశపారంపర్య ధర్మకర్త దాసు వాయునందనరావు, తోట పైడేశ్వరరావు, మాదాసు బాబురావు, జన్యావుల లీలాకృష్ణ, మట్టా బాలాజీ, వరుదు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం పైడమ్మ అమ్మవారు గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆదివారం కోలాహలంగా మారింది. శనివారం రాత్రికి ఆలయానికి చేరుకున్న భక్తులు తెల్లవారుజాము నుంచి స్వామివారి దర్శనం కోసం క్యూలైనులో నిరీక్షించారు. ఆలయం ప్రాంగణం భక్త జనంతో నిండిపోయింది. మధ్యాహ్నం 2 గంటల వరకు ఆలయం వెలుపల క్యూలైనులో భక్తులు వేచి ఉన్నారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి గ్రామంలో పేకాడుతున్నరనే సమాచారంతో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎ. గణేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1,820 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

జూదాలను సహించం

అవనిగడ్డ: జూదాలను సహించేది లేదని అవనిగడ్డ ఎస్ఐ కొప్పిశెట్టి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అవనిగడ్డ ఏడో వార్డులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదివారం పోలీసు సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఓ రాజకీయ నాయకుడితో సహా ఆరుగురు జూదరులను పట్టుకున్నట్లు చెప్పారు. జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,350 స్వాదీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు వివరించారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



బంటుమిల్లి: ఏఐకేఎస్, ఏపీ రాష్ట్ర రైతు సంఘం పిలుపు మేరకు కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం విరాళాలను సేకరిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. గత రెండు రోజులుగా బంటుమిల్లి గ్రామంలో సేకరించిన రూ.6,060 రాష్ట్ర రైతు సంఘం ద్వారా బాధితులకు పంపిస్తామన్నారు. విరాళాలు ఇచ్చిన దాతలు అందరికీ రైతు సంఘం ధన్యవాదాలు తెలిపారు. మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్‌ఘోష్ నాగేశ్వరరావు వెంట ఉన్నారు.

వరదొస్తున్నా వదలని సాగు నీటి కష్టాలు

- చివరి పొలాలకు అందని సాగునీరు
- కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగించకపోవడమే కారణం
- శిథిలావస్థలో అవుట్ పాల్ స్లూయిజ్‌లు



హంసలదీవి సమీపంలో నాట్లు వేయకపోవడంతో పొలాల్లో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు

కోడూరు: తీర ప్రాంతంలో రైతన్నలకు సాగునీటి కష్టాలు తప్పటం లేదు. ఎగువ నుంచి వస్తున్న లక్షల క్యూస్కెల వరద నీరు సముద్రం పాలవుతోంది. దివిసీమలోని తీరప్రాంత పొలాలకు సాగునీరు చేరడం లేదు. దీంతో ఇక్కడ వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. పొలాలకు సాగునీటికి అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

15,16,17 నంబర్ పంట కాలువల కింద..

కోడూరు మండలంలోని తీరప్రాంత గ్రామాలైన హంసలదీవి, ఉల్లిపాలెం, పాలకాయతిప్ప, దింటిమెరక గ్రామాలకు సాగునీటిని మళ్లించే 15,16,17 నంబర్ పంట కాలువల్లో సాగునీరు లేకపోవడంతో రైతులు వ్యవసాయ పనులను కూడా ప్రారంభించే పరిస్థితి లేకుండా పోయింది. ఓ వైపు ఎగువన రైతులు ముమ్మరంగా వరినాట్లు వేసుకుంటుంటే తమకు మాత్రం నారుమళ్లు పోసుకోనేందుకు కూడా నీరు లేదని రైతులు వాపోతున్నారు. కాలువలకు నీటిని విడుదల చేసినా కూడా అవి దిగువకు చేరడం లేదని, ఎగువ ఉన్న అక్రమ తూములు, షట్టర్ల ద్వారా బ్రాంచ్ కాలువలకు వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క..

15,16,17 నంబర్ పంట కాలువల్లో ప్రస్తుతం గుర్రపు డెక్క, తూడు, నాచు పేరుకుపోవడంతో సాగునీరు దిగువకు వెళ్లడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిని విడుదల చేసే ముందు కాలువలను ప్రక్షాళన చేయాలని ఇరిగేషన్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా తమ గోడు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రతీరానికి చివర ఉండడంతో పై నుంచి వచ్చే గుర్రపు డెక్క, తూడు, ఇతర వ్యర్థాలతో కాలువ నిండిపోతోందని రైతులు చెబుతున్నారు. దీంతో సాగునీరు తూముల నుంచి పొలాల్లోకి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఎగువన కాలువలకు నీటిని విడుదల చేసిన తరువాత ప్రక్షాళన పనులు మొదలు పెట్టిన అధికారులు దిగువ కాలువలను పట్టించుకోలేదని ఆవేదన చెందుతున్నారు.



15వ పంటకాలువ లాకుల వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు

నాలుగు వేల ఎకరాల్లో సాగు ప్రశార్థకం..

ప్రస్తుతం సాగునీరు లేకపోవడంతో ఆయా కాలువల కింద ఉన్న సుమారు నాలుగు వేల ఎకరాల్లో వరిసాగు ప్రశార్థకంగా మారింది. ఖరీఫ్ సీజన్ మొదట్లో సాగునీటి సంక్షోభం తరువాత భారీ వర్షాలతో ముంపు సమస్య తమను వెంటాడుతుందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

సముద్ర పోటు సమయంలో..

పాలకాయతిప్ప, ఉల్లిపాలెం వద్ద అవుట్‌పాల్ స్లూయిజ్ గేట్లు పని చేయకపోవడంతో సముద్ర పోటు సమయంలో సముద్ర ఉప్పునీరు కూడా పొలాల్లోకి వచ్చి చేరుతుందని అన్నదాతలు చెబుతున్నారు. దీని వల్ల పొలాలు చౌడుబారి పంట పండే పరిస్థితి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన పాలకాయతిప్ప అవుట్‌పాల్ స్లూయిజ్

స్పందించాలని వినతి..

ప్రస్తుతం బ్యారేజీ, డ్యామ్‌ల్లో పుష్కలంగా సాగు నీరు ఉన్నా తమ కాలువలకు నీరు మళ్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైయిందని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమ కాలువల పరిస్థితిని పరిశీలించి, పొలాలకు సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ధ్వంసం

పట్టించుకోని అధికారులు

కోడూరు: నిబంధనలకు విరుద్ధంగా దమ్ము ట్రాక్టర్లను ఇష్టానుసారంగా నడుపుతూ రహదారుల ధ్వంసానికి కారణమవుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు తమ పొలాల్లో దమ్ము చేసేందుకు వీల్స్ ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నాయి. అయితే ట్రాక్టర్‌కు వీల్స్‌ను పొలం వద్ద ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు నిబంధనలను పూర్తి విస్మరిస్తున్నారు. భారీ వీల్స్‌ను ట్రాక్టర్‌కు అమర్చి రహదారులపై నడుపుతున్నారు. ఈ వీల్స్ కారణంగా రోడ్లు ధ్వంసం కావడంతో పాటు అనేక ప్రాంతాల్లో రోడ్డుపై ఉండే తారు కూడా పెచ్చులు లెచిపోతున్నాయి. కోడూరు, విశ్వనాథపల్లి, లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి, వి.కొత్తపాలెం, కృష్ణాపురం, జరుగువానిపాలెం గ్రామాల్లో ఈ వీల్స్ ట్రాక్టర్ల వల్ల రోడ్లు దెబ్బతిన్నాయి.



కోడూరులోని కృష్ణాపురం వద్ద రహదారిపై వెళుతున్న దమ్ము చక్రాల ట్రాకర్ట్

రెవెన్యూ, పోలీసు అధికారులు ట్రాక్టర్ల యాజమానులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నా కూడా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి దమ్ము ట్రాక్టర్లు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఎల్‌ఈఎఫ్ చర్చి వార్షికోత్సవ ఆరాధన

మచిలీపట్నంటౌన్: నగరంలోని మల్కాపట్నం ఎల్ఈఎఫ్ చర్చి 89వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ ఆరాధన కార్యక్రమాన్ని చర్చి సంఘకాపరి తంటేపూడి ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దైవభయము కలిగి జీవించటం వల్ల జీవితంలో అనేకమైన విషయాల్లో విజయం పొందొచ్చన్నారు. నీతి, నిజాయితీ కలిగి జీవించటం ద్వారా సమాజంలో శాంతి, సంతోషం, సమాధానం వెల్లివిరుస్తాయన్నారు. ఈ మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. 1935లో మద్రాసు నగరంలో ఎస్. డానియెల్ ఆధ్వర్యంలో ఈ సంస్థ స్థాపించబడిందన్నారు. వరంగల్ నుంచి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బ్రదర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎల్ఈఎఫ్ చర్చి దేవుని దయ వల్ల 89 సంవత్సరాలుగా దైవసేవలో కొనసాగుతోందన్నారు. అనేక కుటుంబాల్లో, యువతలో మంచి పరివర్తన, జీవితాల్లో మార్పు కలిగించే విధంగా ఈ చర్చి మార్గదర్శకత్వం చేసిందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా యువతీ, యువకులు చర్చిని సుందరంగా అలంకరించారు. బాలబాలికలు నృత్యగీతాలు ఆలపించి నాటికలను ప్రదర్శించారు. నగరానికి చెందిన పలువురు క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరై దైవగీతాలతో ఆరాధించారు.



మాట్లాడుతున్న పాస్టర్లు ప్రసన్నకుమార్, ప్రభాకరరావు

ఎస్సీ వర్గీకరణ తీర్పును పున:సమీక్షించాలి

మోదుమూడి(అవనిగడ్డ): ఎస్సీ వర్గీకరణ తీర్పును పున:సమీక్షించాలని కోరుతూ మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో దళిత సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. దళిత సంఘాల ప్రతినిధులు ఆదివారం మోదిమూడి గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం సామాజిక వివక్షతలు అనుభవిస్తున్న సామాజిక వర్గాలు అందరూ సమానమేనని రాజ్యాంగం 341 ఆర్టికల్ చెబుతుందన్నారు. 341 ఆర్టికల్స్ సవరణ జరగకుండా ఆ వర్గాలను వర్గీకరించే హక్కు సుప్రీంకోర్టుకు లేదన్నారు. ఇది రాజ్యాంగ పరిధి దాటి ఇచ్చిన తీర్పుగా భావిస్తూ ఈ తీర్పును పున:సమీక్షించాలని కోరుతూ న్యాయపరమైన ఉద్యమ కార్యాచరణకు పిలుపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్, అంబేద్కర్ అభిమాని దాసి సీతారామరాజు, బొంతు ప్రకాష్, మద్దాల ధర్మారావు, మోదమూడి గ్రామ పెద్దలు, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు యువత పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత నాయకులు, సంఘాల ప్రతినిధులు

విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేత

మచిలీపట్నంటౌన్: నగరంలోని విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్‌లో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఆదివారం అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన షేక్ అఫ్రీన్, ఎన్.భువనశృతి, బొడ్డపాటి విజయశృతిలకు రూ.5 వేల చొప్పున, ఇంటర్ విద్యార్థి మోదుమూడి ఉదయ్‌కి రూ.7,500 నగదు పురస్కారాన్ని ఆ బ్యాంక్ డైరెక్టర్లు చిన్నం కోటేశ్వరరావు, రమణారావు, బ్రాంచ్ మేనేజర్ అజయ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ తమ బ్యాంక్ ద్వారా 50 బ్రాంచ్‌లలో 256 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.12.80 లక్షలు, 214 మంది ఇంటర్ విద్యార్థులకు రూ.16.05 లక్షలు జేఈఈ, ఈఈఈ, ఐఐటీ, నెట్, ఎంసెట్ చదివే తొమ్మిది మంది విద్యార్థులకు రూ.90 వేల వంతున నగదు పురస్కారాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మోదుమూడి రామారావు, దేవభక్తుని నిర్మల, పెసల వెంకటేశ్వర్లు, అశ్వధాటి పూర్ణచంద్రరావు, డీఎస్ఎన్ శాస్త్రి, ఖాతాదారులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు స్వీకరించిన విద్యార్థులతో నిర్వాహకులు

సాగరతీరంలో మెరైన్ పోలీసుల గస్తీ



పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ పోలీసులు

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మైరన్ పోలీసులు ప్రత్యేక గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో దూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు తీరానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సందడి చేశారు. యువత కూడా పెద్దఎత్తున తరలివచ్చి వివిధ రకాల ఆటలాడుతూ ఉత్సాహంగా గడిపారు. ఈ నేపథ్యంలో పర్యాటకులకు జాగ్రత్తలు చెప్పుతూ మెరైన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు. సముద్రంలో పలికి వెళ్లి స్నానాలు చేయవద్దంటూ లౌడ్‌స్పీకర్ల ద్వారా హెచ్చరించారు. కృష్ణా సాగర సంగమం వద్ద భారీగా వరద చేరుతున్న నేపథ్యంలో పర్యాటకులను ఆ ప్రాంతానికి అనుమతించలేదు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎం.భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈడేపల్లిలోని శ్రీనివాసనగర్ కాలనీ, మాచవరం, ఆనందపేట, గంగులతోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలన్నారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఇనుగుదురుపేట కబేళారోడ్డులో ఉన్న హజ్రత్ మీర్ హుస్సేన్ అలిషా ఖాదరీ ఉరుసు మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గత మూడు రోజులుగా ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేలాది మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, దర్గా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రం అడ్మిన్ పి.అశోక్ కుమార్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు జరిగిన సెషన్‌లో 125 మందికి 122 మంది హాజరయ్యారన్నారు. ముగ్గురు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు జరిగిన సెషన్‌లో 125 మందికి గాను 122 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు.



నీట్ పీజీ ప్రవేశ పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

గుడివాడరూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపడతామని గుడివాడరూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు పేర్కొన్నారు. గుడివాడ రూరల్ సీఐగా శనివారం రాత్రి ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి దాకా ఇక్కడ సీఐగా పని చేసిన కె.ఏసుబాబు మచిలీపట్నం ఆర్‌పేట సీఐగా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన సీఐ సోమేశ్వరరావు మాట్లాడుతూ గుడివాడరూరల్ సర్కిల్ పరిధిలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలో జూదాలు, కోడి పందేల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

కూచిపూడి(మొవ్వ): విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనంలో పేర్లను తొలగించిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మొవ్వ మండలం కూచిపూడి–పెదపూడి ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయ కక్షలతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు అవమానం కలిగించేలా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు. అంబేడ్కర్ స్మృతి వనానికి ప్రభుత్వం వెంటనే పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ అభిమానులు పాగోలు రమేష్ బాబు, కొప్పుల రాజేంద్ర, బండి సహదేవుడు, కూరపాటి బాలకృష్ణ, లంకపల్లి సుబ్రమణ్యం, దాసరి శ్రీనివాస్, మాతంగి గోపి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళులు



గుడివాడ టౌన్: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య సంస్మరణ సభ ఆదివారం జరిగింది. స్థానిక సీపీఎం కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా భట్టాచార్య పశ్చిమ బెంగాల్ ప్రజలకు ఎనలేని సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యెషయ్య, ఎల్.సురేంద్ర, శ్రీనివాస్, కొండ, గోపాల్, వెంకటేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అది రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై చేసిన దాడే

కృష్ణా జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు గోవర్ధన్



అవనిగడ్డ: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పెడస్టల్ వద్ద జరిగిన దుశ్చర్యలను కృష్ణా జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్ ఖండించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరు తొలగించినప్పటికీ అది భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై చేసిన దాడిగా ప్రభుత్వం పరిగణించాలన్నారు. నగర నడిబొడ్డులో కోట్లాది మంది ఆరాధ్యుడు భారత దేశానికి అత్యున్నత రాజ్యాంగం అందించిన మహనీయుడు విగ్రహం వద్ద లోపించిన భద్రత వైఫల్యాన్ని గుర్తించి చక్కదిద్దాలని కోరారు. ఇలాంటి ఘటన రాష్ట్ర ప్రభుత్వానికి తలవంపులు తెచ్చే విధంగా ఉందని, దోషులు ఎవరో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతాఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జీఓ ప్రకారమే పని సర్దుబాటు చేయాలి

ముదినేపల్లి రూరల్ : ప్రభుత్వం 2020లో జారీ చేసిన జీఓ 53 ప్రకారమే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాల రాజేంద్ర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మార్గదర్శకాల్లో లోపాలను సవరించి సర్దుబాటు ప్రక్రియ ప్రారంభించాలని పేర్కొన్నారు. పాఠశాలలో సీనియారిటీకి బదులుగా కేడర్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గుడివాడరూరల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని గుడి వాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. గుడివాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఎటువంటి గొడవలు, ఘర్షణలు తలెత్తకుండా ముందుగానే రౌడీషీట్లు ఉన్న వారికి సత్ ప్రవర్తనపై అవగాహన కల్పించారు. జరిగిన విషయాలను మర్చిపోయి ప్రవర్తన తీరు మార్చుకుని జీవనం సాగించాలని సూచించారు. ప్రతిఒక్కరూ పోలీసుల హెచ్చరికలు, నియమాలు పాటించాలని పేర్కొన్నారు.